

## శివారు ప్రాంతాలకు భారీ డిమాండ్

వెస్ట్రన్ ఏరియా, కోర్ సిటీకి ధీటుగా అభివృద్ధి

నలుదిశల విస్తరిస్తున్న రియల్ వ్యాపారం

3 లో

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ 18.05.2025 | 24 క్యారెట్లు 85,315.00 | కిలో వెండి 1,02,778.00 | 33 ℃ | సంపుటి:3 | సంచిక:197

www.vishalabharati.com



## ఉగ్రవాదులకు అడ్డగా హైదరాబాద్

- కొన్ని రాజకీయ శక్తులు వారికీ ఆశ్రయం
- మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు సంచలన వ్యాఖ్యలు
- ట్యాంక్ బండ్‌పై తిరంగా ర్యాలీ.
- అంబేడ్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు
- భారత్ మతాకి జై నినాదాలతో మార్మోగిన ట్యాంక్ బండ్
- సిందూర్ విజయంతో సైన్యానికి సంఘీభావం.

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్ ట్యాంక్ బండ్ వేదికగా శనివారం జరిగిన తిరంగా ర్యాలీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహా పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. ఈ ర్యాలీ ప్రారంభం కావడానికి ముందు, అక్కడకు భారీగా చేరుకున్న యువత, విద్యార్థులు, ఆర్మీ రిటైర్ అధికారులు, మహిళలు బీజేపీ శ్రేణుల మధ్య ఉత్సాహం కనిపించింది. ఈ కార్యక్రమం ఆపరేషన్ సిందూర్ విజయంతో సైన్యానికి సంఘీభావంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ విద్యా సాగర్ రావు కూడా పాల్గొన్నారు. ఆయన ర్యాలీకి చేరుకోవడంతో

..మిగతా 2 లో

## మహిళలు కోటీశ్వరులు కావాలి

- రాష్ట్రం 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ చేరుకోవాలి
- కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలనేదే ప్రభుత్వ లక్ష్యం
- దేశానికి మహిళా శక్తిని కాంగ్రెస్ పార్టీ చూపించింది
- ఇందిరా మహిళా శక్తి బజార్ రాష్ట్రానికి తలమానికం
- ఈనెల 21న ఇందిరా మహిళా స్టాళ్లను సందర్శించనున్న మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు
- జూబ్లీహిల్స్ జేఆర్సీలో వీహబ్ వుమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం
- ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి



దేశానికి మహిళా శక్తి అంటే ఏంటో చూపించింది కాంగ్రెస్ పార్టీనేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్లోని జూబ్లీహిల్స్ జేఆర్సీ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన వీహబ్ వుమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాంకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు సంస్థలతో వీహబ్ చేసుకున్న ఎంఓయూలకు సంబంధించిన పత్రాలను ఆయా కంపెనీల ప్రతినిధులకు అందించారు.

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ మహిళా శక్తిని తక్కువ అంచనా వేయదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భారత మహిళా శక్తి ఏంటో ఇందిరాగాంధీ చూపించారని, సోనియా గాంధీ సుదీర్ఘంగా పార్టీని నడిపి తన సమర్థతను నిరూపించుకున్నారని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల మహిళలు రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లాలన్నా, సునాయాసంగా వెళ్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. వారివల్ల ఆర్టీసీ లాభాల్లోకి వెళ్లిందన్నారు. పాఠశాలలు, పిల్లలకు యూనిఫాంలు ఇలా ప్రతీది మహిళల చేత సమర్థవంతంగా నడుస్తోందని వివరించారు.హైటెక్ సిటీ పక్కనే మూడున్నర ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి బజార్ రాష్ట్రానికి తలమానికంగా మారిందని చెప్పారు. పట్టణ ప్రాంత మహిళలు కూడా సెర్ప్లో చేరాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఆడబిడ్డలు వ్యాపారంలో నిలదొక్కుకుంటే కుటుంబాలు ఆర్థికంగా బాగుంటాయని అన్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు ఒక యూనిక్ ఐడీ కార్డు ఇస్తామన్నారు. మహిళల ఆరోగ్యం నుంచి సంపాదన వివరాలన్నీ తెలిపేలా యూనిక్ ఐడీ కార్డు ఉంటుందని స్పష్టం చేశారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టంగా చెప్పారు. రాష్ట్రం 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ చేరుకోవాలంటే మహిళలు కోటీశ్వరులు కావాలని తెలిపారు. ఈనెల 21న ఇందిరా మహిళా స్టాళ్లను సందర్శించనున్న మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు ఆడబిడ్డలకు రూ. 500లకే సిలిండర్

..మిగతా 2 లో



## మా భూమిని కబ్జా చేశారు

- కాపాడండి సార్'
- తమ భూమి తమకు దక్కేలా చూడాలి ఓతల్లి
- సీఎం రేవంత్ రెడ్డి కి జవాన్ రిక్వెస్ట్

2 లో

## భారత సైన్యం పాక్‌లోని ఏ ప్రాంతాన్నైనా టార్గెట్ చేయగలదు

- పాక్‌లో భారత ఆర్మీ చేరుకోలేని ప్రాంతంలేదు
- భారత సాయుధ బలగాల ధైర్యసాహసాలపై ఎల్జీ మనోజ్ సిన్హ ప్రశంస



విశాలభారతి,స్టేట్ బ్యూరో:

పాక్‌లో భారత ఆర్మీ చేరుకోలేని ప్రదేశమంటూ ఏదీ లేదని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అన్నారు. భారత సాయుధ బలగాల ధైర్యసాహసాలను ఆయన ప్రశంసించారు. భారత్‌తో సంధి కుదర్చమంటూ ప్రపంచ దేశాలకు పాక్ బతిమలాడుకుందని చెప్పారు. భారతదేశం ఎన్నడూ యుద్ధం కోరుకోదని, శాంతియుతంగా జీవించాలని కోరుకుంటుందని పేర్కొన్నారు. నియంత్రణ రేఖ

..మిగతా 2 లో

## 9 ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం

### ఆపరేషన్ సిందూర్‌తో పాక్ బెంబేలు

- టెర్రరిస్టు దాడులకు రెట్టింపు బలంతో సమాధానం
- పాకిస్తాన్ బెదిరింపులకు ఖాతర చేయలే
- పాక్‌లో 100 కిలోమీటర్ల లోపలకు చొచ్చుకెళ్లి మరీ దాడులు
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా



విశాల భారతి, స్టేట్ బ్యూరో:

ఆపరేషన్ సిందూర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రశంసలు కురిపించారు. ఉగ్రదాడులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన సమాధానం ప్రపంచ దేశాలను ఆశ్చర్యంలో ముంచెత్తితే, పాక్ బెంబేలెత్తిందని అన్నారు. పాక్‌లో 100 కిలోమీటర్ల లోపలకు భారత సాయుధ బలగాలు చొచ్చుకెళ్లి మరీ భీకరదాడుల

..మిగతా 2 లో



## నీట్ UG 2025 ఫలితాలపై మద్రాస్ హైకోర్ట్ స్టే

- పరీక్షకు 20.8 లక్షల మంది అభ్యర్థులు హాజరు
- 13 మంది విద్యార్థులు హైకోర్టులో పిటిషన్
- తదుపరి విచారణ జరిగే వరకూ ఫలితాలు ఆపండి

2 లో



## మూడు రోజుల్లో రాష్ట్రంలో భారీ వర్షం

- గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగం ఈదురుగాలులు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

2 లో

## బీఆర్ఎస్‌లో చీలిక ఖాయం

- ప్రస్తుతం ఆ పార్టీలో నాలుగు స్తంభాలాట నడుస్తోందని
- హరీష్ రావు నేతృత్వంలో చీలిక దిశగా అడుగులు
- రజితోత్సవ సభలో కేటీఆర్‌దే పెత్తనం..
- డమ్మీగా హరీష్, కవితలు
- తండ్రీ, కొడుకు, కూతురు, అల్లుడుల మధ్య ఆదిపథ్య పోరు
- జగన్, షర్మిల తరహాలోనే కేటీఆర్‌కు కవిత తగాదాలు
- బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

బీఆర్ఎస్‌లో నాలుగు స్తంభాలాట నడుస్తోందని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్ చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి హరీష్ రావ్ నేతృత్వంలో బీఆర్ఎస్ చీలిక దిశగా అడుగులు వేస్తోందన్నారు. పదిమంది ఎమ్మెల్యేలు వెళ్లిపోతే బీఆర్ఎస్ఎల్పీ చీలిపోతుందన్నారు. తండ్రీ, కొడుకు, కూతురు, అల్లుడు మధ్య విబేధాలు ఉన్నాయని తెలిపారు. రజితోత్సవ సభలో కేటీఆర్‌దే పెత్తనమని.. కవిత,హరీష్‌రావులకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదని తెలిపారు. హరీష్, కవితలు డమ్మీగా మిగిలారని అన్నారు. వివిధ కారణాలతో కేసీఆర్ క్రియాశీలకంగా ఉండటం లేదని.. సభలో కూడా అంత యాక్టీవ్‌గా లేరన్నారు. తన తరువాతి

..మిగతా 2 లో

## నిరుద్యోగులకు సర్కార్ గుడ్ న్యూస్

- త్వరలో 20 వేలకు పైగా ఉద్యోగాలకు నోటిఫికేషన్
- రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పూర్తి కావడంతో ప్రభుత్వం కసరత్తు
- ప్రభుత్వం జారీ చేసిన జాబ్ క్యాలెండర్ కు అనుగుణంగా మార్పులు చేర్పులు
- కేటగిరీల వారీగా గ్రూప్స్, టీచర్, పోలీసు, ఎలక్ట్రికల్, గురుకుల, వైద్య విభాగాల నియామకాలు



..మిగతా 2 లో

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

ఆదివారం,
18.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




## మహిళలు కోటీశ్వరులు కావాలి

**తరువాయి భాగం:** అందిస్తున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణను మహిళలకే అప్పగించామని, మహిళల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు కృషి చేస్తామని మాటిచ్చారు. ఈనెల 21న ఇందిరా మహిళా స్టాళ్లను మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శిస్తారని వెల్లడించారు. సెర్ప్ సభ్యుల సంఖ్యను కోటి మందికి చేర్చాలని, మహిళలకు అండగా నిలబడతా ఆర్థికంగా ఎదగండని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. కార్పొరేట్ కంపెనీలకు డబ్బులు ఇస్తే తీసుకొని దేశం విడిచి పారితున్నారని, మహిళలకు ఇచ్చే ప్రతి రూపాయి వడ్డీతో సహా చెల్లిస్తున్నామని చెప్పారు. మహిళలు ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. కాగా అక్కడ ఏర్పాటు చేసిన అన్ని స్టాళ్లను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించి, ఆయా ఉత్పత్తుల గురించి విక్రయదారులను అడిగి తెలుసుకున్నారు.




## తలుక్కుమన్న అందాల భామలు

- రామోజీ ఫిలిం సిటీ సందర్శన
- హాజరైన ప్రజాప్రతినిధులు , అధికారులు

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి :**
ప్రపంచ అందాల భామల 72వ పోటీలో భాగంగా మిస్ వరల్డ్ 2025 కంటెస్టెంట్లు శనివారం హైదరాబాద్ శివారులోని రామోజీ ఫిల్మ్ సిటీ ని సందర్శించారు. ఈ సందర్భంగా మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం, అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అందాల భామలు ప్రత్యేక దుస్తులు ధరించి అల్లరించారు. అలాగే వారు రామోజీ ఫిల్మ్ సిటీలోని వివిధ అద్భుతమైన లొకేషన్స్ లను ఆసక్తిగా తిలకించారు. అనంతరం రామోజీరావు జ్ఞాపకార్థంగా రామోజీ సైన్ ఆఫ్ దగ్గర ఫోటోలకు పోజులిచ్చారు. ఈ కార్యక్రమంలో రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం ఈనాడు సంస్థల ఎండీ కిరణ్, ఉషాకిరణ్ మూవీస్ ఎండీ విజయ శ్రీ, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాం రెడ్డి, పోలీస్ ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు సర్కార్ గుడ్ న్యూస్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో :**
రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పూర్తి కావడంతో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ల జారీకి పరిపాలన కసరత్తు మొదలైంది. పలు నోటిఫికేషన్లను వీలైనంత త్వరగా జారీ చేసేందుకు ప్రభుత్వం, నియామక సంస్థలు కార్యాచరణ చేపట్టాయి. గతేడాది (2024 2025) ప్రభుత్వ కొలువులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం జారీ చేసిన జాబ్ క్యాలెండర్కు అనుగుణంగా ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనల్లో మార్పులు చేర్పులు జరుగుతున్నాయి. ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా రోస్టర్ ప్రకారంగా ఉద్యోగ ఖాళీల వివరాలను తెప్పించుకుని, భర్తీ చేసేందుకు సవరణ క్యాలెండర్ జారీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. త్వరలో 20 వేలకు (20వేల) పైగా పోస్టులతో జాబ్ నోటిఫికేషన్లు వెలువడే అవకాశమున్నట్లుగా సమాచారం.
రాష్ట్రంలో ప్రభుత్వ కొలువుల భర్తీకి ఏటా క్యాలెండర్ను ప్రకటించాలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు 202425 ఏడాదికి జాబ్ క్యాలెండర్ను జారీ చేసింది. దాని ప్రకారం జాబ్ నోటిఫికేషన్ను జారీ చేసేందుకు ప్రభుత్వ విభాగాలు ఖాళీలను గుర్తించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్తో పాటు, ఇతర నియామక సంస్థలకు ప్రతిపాదనలు పంపించాయి. అది అమలు చేయనున్న సమయంలో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఎస్సీల్లోని ఉపకులాలకు న్యాయం జరిగేందుకు వీలుగా వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యేవరకు కొత్త నోటిఫికేషన్లను జారీ చేయబోమని ప్రభుత్వం ఇదివరకే స్పష్టం చేసింది. దీంతో గత సెప్టెంబరు నుంచి షెడ్యూలు ప్రకారం వెలువడాల్సిన ఉద్యోగ నియామక ప్రకటనలు నిలిచిపోయాయి. ఏప్రిల్ 14వ తేదీన వర్గీకరణ అమల్లోకి రావడంతో ప్రభుత్వ విభాగాలు ఖాళీల గుర్తింపు ప్రక్రియను మొదలుపెట్టాయి. గతంలో ఇచ్చిన ప్రతిపాదనలు సవరించి పంపించాలని ఇప్పటికే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సంబంధిత విభాగాలకు లేఖలు రాసింది. ఈ మేరకు ప్రభుత్వ విభాగాలు ఎస్సీ ఉపకులాల గ్రూపుల ఆధారంగా సవరణ ప్రతిపాదనలను పంపిస్తున్నాయి. ఉద్యోగ క్యాలెండర్లో పేర్కొన్న కేటగిరీల వారీగా గ్రూప్స్, టీచర్, పోలీసు, ఎలక్ట్రికల్, గురుకుల, వైద్య విభాగాల నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనలు జారీ చేయనుంది. బ్యాక్లాగ్ ఉద్యోగాలను కలిపి నోటిఫికేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది. గ్రూప్స్తోపాటు ఇంజినీరింగ్, గురుకుల, టీచర్ ఉద్యోగ ప్రకటనలు రానున్నాయి. ఆర్టీసీ, వైద్య విభాగాల పరిధిలోనే అత్యధికంగా దాదాపు 10 వేల వరకు పోస్టులు ఉంటాయని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ విభాగాలు, విద్యుత్తు సంస్థల్లోని ఇంజినీరింగ్ విభాగాల్లోనూ 23 వేల వరకు ఖాళీలు ఉన్నట్లుగా విశ్వసనీయ సమాచారం. గురుకుల నియామకాల్లో దాదాపు 2 వేల పోస్టులు బ్యాక్లాగ్గా ఉన్నట్లుగా తెలిసింది.



## ఉగ్రవాదులకు అడ్డగా హైదరాబాద్

**తరువాయి భాగం**
అక్కడి వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు జరిగిన ఈ ర్యాలీ, భారత్ మతాకి జై నినాదాలతో మార్మోగుతూ ట్యాంక్ బండ్ పరిసరాలను మరింత ఉత్సాహంగా మార్చింది. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ ఉగ్రవాదులకు అడ్డగా మారిందన్నారు. కొన్ని రాజకీయ శక్తులు వారికీ ఆశ్రయం ఇస్తున్నాయని ఆరోపించారు. హైదరాబాద్ కేంద్రంగా రెచ్చిపోతున్న ఉగ్రవాదులకు ముగింపు పలకాలని ఆయన వ్యాఖ్యానించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కూడా ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ వీరోచిత పోరాటం చేసిన సైనికులందరికీ జేజేలు కొట్టాలన్నారు. ఒకప్పుడు ప్రపంచానికి విశ్వ గురువుగా ఉన్న ఇండియా, ఇప్పటికీ ఏ దేశంపై యుద్ధానికి కాలు దువ్వలేదన్నారు. మన దేశాన్ని కాపాడుకోవడానికి మాత్రమే ఎదురు దాడి చేసినట్లు పాకిస్థాన్ ఎటాక్ గురించి ప్రస్తావించారు. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ వ్యూహంతో వ్యవహరించారని, భిన్నత్వంలో ఏకత్వంగా ఇండియా ఉందని పేర్కొన్నారు.ఈ ర్యాలీ సమయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారు పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని ఫ్లాప్ చేయాలని చూస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి సహకరించాలని విజ్ఞప్తి చేసిన కిషన్ రెడ్డి, బీజేపీ తిరంగ్ ర్యాలీలో జరిగిన తోపులాటపై కూడా స్పందించారు. తోపులాటలో మందకృష్ణ మాదిగ కాలికి గాయం కావడంతో ఆయనను వెంటనే ర్యాలీ నుంచి ఆస్పత్రికి తీసుకెళ్లారు.

## బీఆర్ఎస్లో చీలిక ఖాయం

**తరువాయి భాగం**
బీఆర్ఎస్ చీఫ్ కేటీఆర్ అని పరోక్షంగా ఇండికేషన్ ఇచ్చారని చెప్పుకొచ్చారు. డీఫాల్ట్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ కొనసాగుతున్నారని.. కేసీఆర్ పూర్తి స్వేచ్ఛ ఇచ్చారన్నారు. సభలో తండ్రీకొడుకులు కీలకంగా వ్యవహరించారని అన్నారు. కవిత, హరీష్ తీవ్ర అసంతృప్తి తో ఉన్నారని చెప్పుకొచ్చారు. కవిత ఒంటరి అయ్యిందని... ఆదిపత్య పోరు తారా స్థాయికి చేరిందని పేర్కొన్నారు. కవిత తీసుకున్న తెలంగాణ తల్లి మార్పు, పూలే విగ్రహం ఏర్పాటుకు పార్టీ నుంచి మద్దతు రాలేదన్నారు. మహిళా సమానత , సామాజిక తెలంగాణ సాధన అంశంలో బీఆర్ఎస్ విఫలమైందన్న వ్యాఖ్యలు వ్యూహాత్మకమే అని వెల్లడించారు. పదవులు, ఆస్తులు అన్నీ కేటీఆర్ కేనా అంటూ లేఖాస్త్రంలో కవిత తిరుగుబాటు చేశారన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనపై కవిత విమర్శలు చేస్తున్నారని.. కేసీఆర్కు రాసిన లేఖ త్వరలోనే బయటపెట్టే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఉద్యమంలో జాగృతి కృషి ఉందని.. వాస్తవాలు బయటపెట్టాలని కవిత అనుకుంటున్నట్లు తెలిపారు. కేటీఆర్కే అన్నీ ఇస్తుండటంతో కవిత తిరుగుబాటు జెండా ఎగురవేశారన్నారు. తనను రాజకీయంగా అణిచి వేసేందుకు కేటీఆర్ కుట్ర చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారని వ్యాఖ్యలు చేశారు. మేడే రోజు తండ్రి పాలనా వైఫల్యాలు ఎండగట్టినట్లు చెప్పారు. తనను రెచ్చగొడితే మరింత రెచ్చిపోతానని చెప్పడం ఆమెలోనే ఆవేదన బయటపడిందన్నారు. బీఆర్ఎస్లో ఒకే పవర్ సెంటర్ ఉండాలని కేటీఆర్ అభిమతమని తెలిపారు. జగన్, షర్మిల తరహాలోనే కేటీఆర్కు కవిత తయారైనట్లు తెలిపారు. సొంత ఎజెండా పెట్టుకుని పని చేయకూడదని కేటీఆర్ చెప్పడం ఇందుకు నిదర్శనమన్నారు. బీఆర్ఎస్పై విమర్శలు చేసిన వెంటనే హరీష్ రావు మీడియా సమావేశం వెనక కేసీఆర్ హస్తం ఉందన్నారు.
బీఆర్ఎస్ను చీల్చడం రేవంత్ రెడ్డితో కాలేదని.. అందుకే హరీష్ను అడ్డం పెట్టుకొని తన పంతం నెగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ ఫారిన్ టూర్లోకి వెళ్లగానే బీఆర్ఎస్లో చీలిక రాబోతోందంటూ సంచలన కామెంట్స్ చేవారు. ఈ నెలాఖరులోగా లేదా మొదటి వారంలో చీలిక వస్తుందన్నారు. చీలిక కోసం తెరవెనుక జరగాల్సిన తంతు రేవంత్ రెడ్డి సహకారంతో హరీష్ రావు, కవితలు చేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్లో ఉంటే తమకు ఎదిగే అవకాశం ఉండదని హరీష్, కవితలు ఈ వ్యూహానికి తెరతీశారంటూ బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సెన్షేషనల్ కామెంట్స్ చేశారు.

## 9 ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం

**తరువాయి భాగం**
జరిపాయని చెప్పారు. అనేక అంతర్జాతీయ ఉగ్ర కార్యకలాపాలకు వ్యూహరచన చేసి, సియాల్కోట్, ఇతర ఉగ్రవాద శిబిరాలలో తలదాచుకున్న ముష్కరులకు భారత్ చాలా స్పష్టమైన సందేశమిచ్చిందన్నారు. భారత ప్రజలపై ఎలాంటి టెర్రరిస్టు దాడులకు పాల్పడినా రెట్టింపు బలంతో విరుచుకుపడతామనే సష్టమైన సంకేతాలిచ్చామని గుజరాత్లోని గాంధీనగర్లో శనివారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో అమిత్షా అన్నారు. ఈసారి ఆపరేషన్ సిందూర్తో పాకిస్తాన్లోని జైషే మహమ్మద్, లష్కరే తొయిబా వంటి ఉగ్రవాద సంస్థల ప్రధాన కార్యాలయాలను ధ్వంసం చేశాం. టెర్రరిస్టులకు ఆశ్రయం కల్పిస్తూ శిక్షణ ఇస్తున్న 9 ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేశాం'' అని అమిత్షా చెప్పారు. అణుబాంబులున్నాయంటూ పాకిస్తాన్ చేసిన బెదిరింపులు భారత్ ఖాతర చేయలేదని హోం మంత్రి చెప్పారు. ''ఆటంబాంబులున్నాయని బెదిరిస్తే భయపడిపోతామని వారు అనుకున్నారు. కానీ మన ఆర్మీ, నేవీ, వాయిసేన ఏమాత్రం ఖాతరు చేయకుండా వారికి గట్టి గుణపాఠం చెప్పింది. మన బలగాల సహనం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వ పటిమ చూసి యావత్ ప్రపంచం ప్రశంసలు కురిపించింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత బలగాలు పాక్లో 100 కిలోమీటర్ల లోపలకు చొచ్చుకెళ్లి మరీ దాడులు జరపడం ఇదే మొదటిసారి'' అని అమిత్షా తెలిపారు

## భారత సైన్యం పాక్లోని ఏ ప్రాంతాన్నైనా టార్గెట్ చేయగలదు

**తరువాయి భాగం**
వెంబడి తంగ్ధర్ సెక్టార్లోని సాయుధ బలగాలను మనోజ్ సిన్హా శనివారంనాడు కలుసుకున్నారు.భారత బలగాల ధైర్యసాహసాలు, భారత్తో సంధి కోసం పాక్ పాకులాడటం ఈరోజు యావత్ ప్రపంచం చూసింది. భారతదేశం ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. మరి కొద్దిరోజుల్లోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కావాలనుకుంటోంది. అభివృద్ధి భారతం కలను సాకారం చేసుకునే దిశగా మనం ముందుకు వెళ్తున్నాం'' అని మనోజ్ సిన్హా చెప్పారు. అయితే పొరుగు దేశం మాత్రం అప్పులు తెచ్చుకున్న సొమ్ములతో మానవాళి వినాశనానికి పాటుపడుతోందని విమర్శించారు. భారత బలగాలు ఇచ్చిన సమాధానంతోనైనా పాక్ గుణపాఠం నేర్చుకోవాలన్నారు. భారత సైన్యం పాక్లోని ఏ ప్రాంతాన్నైనా టార్గెట్ చేయగలదని, మన బలగాల ధైర్యం, సామర్థ్యం, దేశం పట్ల ఉన్న అంకితభావానికి తాను శాల్యూట్ చేస్తున్నానని అన్నారు. ఎలాంటి సంక్షోభం వచ్చినా మన దేశం సైన్యం చేతిలో సురక్షితంగా ఉందని ప్రజలు తెలుసుకోవాలన్నారు.



## మూడు రోజుల్లో రాష్ట్రంలో భారీ వర్షం

- గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగం ఈదురుగాలులు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:
రాబోయే మూడు రోజుల్లో తెలంగాణలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాగల మూడు రోజులలో రిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుండి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని పేర్కొంది. పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున నైరుతి రుతుపవనాలు మరింత పురోగమిస్తూ దక్షిణ అరేబియా సముద్రం, దక్షిణ బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలు, అండమాన్ సముద్రంలోని మిగిలిన ప్రాంతం, మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలలోకి ప్రవేశించే అవకాశం ఉంది. దక్షిణ తెలంగాణ, దాని పరిసర ప్రాంతాలలో ఈరోజు ఒక ఉపరితల చక్రవాత ఆవర్తనం ఏర్పడింది. నిన్న ఆగ్నేయ బంగాళాఖాతం, దాని పరిసరాల్లో ఏర్పడిన ఉపరితల చక్రవాత ఆవర్తనం ఈరోజు సగటు సముద్ర మట్టం నుండి 1.5 నుండి 5.8 కి మీ ఎత్తులో కొనసాగుతోంది. ఈ ఆవర్తనం నుండి ద్రోణి ఒకటి మధ్య కోస్తా ఆంధ్ర తీరం వరకు సగటు సముద్రమట్టం నుండి 1.5 & 5.8 కి. మీ ఎత్తులో ఏర్పడింది. ఈ ద్రోణి ఎత్తు పెరిగే కొద్దీ నైరుతి దిక్కుకు వాలి ఉంది అని వాతావరణ శాఖ పేర్కొంది. ఇక రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలో.. ఈ రోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొన్ని జిల్లాలలో చాలాచోట్ల కురిసే అవకాశం ఉంది. ఎల్లుండి తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు రాష్ట్రం లోని కొన్ని జిల్లాలలో కొన్నిచోట్ల కురిసే అవకాశం ఉంది. ఈరోజు, రేపు రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో ఉరుములు మెరుపులు, గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగం కలిగిన ఈదురుగాలులు కూడిన భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. ఎల్లుండి రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో ఉరుములు మెరుపులు మరియు గంటకు 3040 కి.మీ వేగం కలిగిన ఈదురుగాలతో కూడిన వర్షాలు కొన్నిచోట్ల కురిసే అవకాశం ఉంది అని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

## నీట్ UG 2025 ఫలితాలపై మద్రాస్ హైకోర్ట్ స్టే

- పరీక్షకు 20.8 లక్షల మంది అభ్యర్థులు హాజరు
- 13 మంది విద్యార్థులు హైకోర్టులో పిటిషన్
- తదుపరి విచారణ జరిగే వరకూ ఫలితాలు ఆపండి


**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
మద్రాస్ హైకోర్ట్ NEETUG 2025 పరీక్షా ఫలితంపై మధ్యంతర స్టే విధించింది. తదుపరి విచారణ జరిగే వరకూ ఫలితాలు విడుదల చేయవద్దని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని ఆదేశిస్తూ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. చెన్నైలోని అవడి పరీక్షా కేంద్రంలో విద్యుత్ అంతరాయం కారణంగా రాయడంలో ఇబ్బంది ఎదురైందని విద్యార్థులు ఆరోపిస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఈ ఉత్తర్వులు ఇచ్చింది.
తమ పరీక్షా కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన తర్వాత ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో వెలుతురు లేకపోయినా పరీక్ష రాయాల్సి వచ్చిందని 13 మంది విద్యార్థులు మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం నీట్ ఫలితాల విడుదలపై కీలక నిర్ణయం తీసుకుంది. ఫలితాలు ఇప్పుడే వెల్లడి చేయొద్దని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA)ని ఆదేశిస్తూ జూన్ 2వ తేదీకి తదుపరి విచారణను వాయిదా వేసింది. కాగా, మధ్యప్రదేశ్ హైకోర్ట్ ఇండోర్ బెంచ్ సైతం నీట్ యూజీ 2025 ఫలితాల ప్రకటనపై తాత్కాలిక స్టే విధించింది. ఈ అంశంపై నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టిఏ), కేంద్ర ప్రభుత్వం, మధ్యప్రదేశ్ వెస్ట్ జోన్ విద్యుత్ పంపిణీ కంపెనీకి నోటీసు జారీ చేసింది. గతంలో కూడా పేపర్ లీక్ లు, ఇతర అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. తాజాగా ఈ వివాదం నీట్ ఫలితాలు ఆలస్యానికి కారణం అవుతోంది. దీంతో నీట్ పరీక్ష విశ్వసనీయతపై పలువురు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఇలాంటి సంఘటనలు వైద్య ప్రవేశ పరీక్ష ప్రక్రియపై విశ్వాసాన్ని తగ్గిస్తాయని నిపుణులు అంటున్నారు. కాగా, అందరి కళ్లూ కోర్టు తుది నిర్ణయంపైనే ఉన్నాయి. NTA మే 4న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ దేశవ్యాప్తంగా వివిధ పరీక్షా కేంద్రాలలో NEET UG 2025 పరీక్షను నిర్వహించింది. 23 లక్షల మంది అప్లై చేసుకోగా.. 20.8 లక్షల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. కాగా, తదుపరి ఫలితాల విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## మా భూమిని కబ్జా చేశారు

- కాపాడండి సార్'
- తమ భూమి తమకు దక్కేలా చూడాలి ఓతల్లి
- సీఎం రేవంత్ రెడ్డి కి జవాన్ రిక్వెస్ట్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
తాను దేశ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తూ, శత్రువుల నుంచి దేశాన్ని కాపాడుతుంటే, తన భూమిని మాత్రం కొందరు కబ్జా చేసి కుటుంబసభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఓ జవాన్ వాపోయారు. తమ భూమి తమకు దక్కేలా చూడాలంటూ పలు సామాజిక మాధ్యమాల వేదికగా సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తాను సరిహద్దుల్లో దేశం కోసం పోరాడుతుంటే, సొంతూరిలో భూమిని కబ్జా చేశారని దుబ్బాక(ఎం) చౌదరిపల్లికి చెందిన జవాన్ రామస్వామి వాపోయారు. తన తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భూమిని కబ్జా చేసిన వ్యక్తి తమ్ముడు వీఆర్ఏగా నిధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు.
స్థానిక తహసీల్దార్కు ఫిర్యాదు చేద్దామన్నా వారికే మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఆర్డీవో, కలెక్టర్ను కలిసినా ఫలితం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించి, న్యాయం చేయాలని కోరారు. మరోవైపు జవాన్కు తగిన న్యాయం చేయాలంటూ మాజీ మంత్రి హరీశ్రావు సిద్దిపేట కలెక్టర్ను ఎక్స్ వేదికగా కోరారు.

హైదరాబాద్ శివారు ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఓఆర్ఆర్ చుట్టూ లగ్జరీ నిర్మాణం జోరుగా సాగుతుండగా, మారుతున్న జీవన శైలి, అభిరుచులకు అనుగుణంగా కోర్ సిటీ దాటి శివారులకు వెళ్లేందుకు నగరవాసులు ఇంట్రెస్ట్ చూపుతున్నారు. అందుకే సిటీకి దూరమైన, లోకేషన్, మార్కెట్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఔటర్ సిటీ వైపు రియల్ వ్యాపారానికి భారీ డిమాండ్ వస్తోంది.




# శివారు ప్రాంతాలకు భారీ డిమాండ్

## వెస్ట్రన్ ఏరియా, కోర్ సిటీకి ధీటుగా అభివృద్ధి

## నలుదిశల విస్తరిస్తున్న రియల్ వ్యాపారం

**జోరుగా మాల్స్....**

**కోర్ సిటీలో పెరిగిన విపరీతమైన ట్రాఫిక్ సమస్యలు, కమర్షియల్ స్పేస్ డిమాండ్ కారణంగా కొత్తగా వచ్చే మాల్స్ అన్ని శివారు ప్రాంతాల్లో వేగంగా మొదలవుతున్నాయి. ఇప్పటికే ఐటీ కారిడార్, జూబ్లీ హిల్స్, బంజారా హిల్స్, పంజాగుట్ట, కూకట్ పల్లి వంటి ఏరియాలు హాట్ స్పాట్ గా ఉండగా, రానున్న రోజుల్లో శివార్లోనూ జోరుగా కొత్త మాల్స్ రానున్నాయి. ఈ క్రమంలో ఉప్పల్, నాగోల్, వనస్థలిపురం, కర్మన్ ఘాట్, మౌలాలీ, మేడ్చల్, ఆదిభట్ల, సుచిత్ర వంటి ప్రాంతాలు ముఖ్య కేంద్రంగా మారనున్నాయి. ప్రస్తుతానికి సిటీలో 40 లక్షల చదరపు అడుగుల్లో చిన్నా పెద్ద కలిపి 50 మాల్స్ ఉన్నాయి. పెరుగుతున్న కమర్షియల్ స్పేస్ డిమాండ్, మెట్రో ప్రజల లైఫ్ స్టయిల్ కు అనుగుణంగా మల్టీ పెక్సులు, రెస్టారెంట్లు, షాపింగ్ కాంప్లెక్సుల నిర్మాణాలు జరుగుతాయి. దీంతో 2020నాటికి కనీసం 25లక్షల చదరపు అడుగుల్లో అందుబాటులోకి వస్తాయనీ రియల్ రంగ నిపుణులు చెబుతున్నారు. దీంతో డెవలపర్లు కూడా ఈసీఐఎల్, ఎల్బీ నగర్, ముషీరాబాద్ వంటి రద్దీగా ఉండే ప్రాంతాలపై ఫోకస్ పెట్టి మరీ కొత్త ప్రాజెక్టులను నిర్మిస్తునారు. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లోనూ చిన్న స్థాయి మాల్స్ ఏర్పాటు చేసేందుకు పలు డెవలపర్లు దృష్టిపెట్టారు.**

**విశాలభారతి, హైదరాబాద్:**

సిటీ రియల్ ఎస్టేట్ రంగంలో శివారులకూ మహర్దశ పట్టుకుంది. ఓపెన్ ప్లాట్లతో వందలాది రియల్ సంస్థలు అధునాతన సదుపాయాలతో వెంచర్లు నిర్మించడంతో క్రమంగా శివారు ప్రాంతాల రూపురేఖలు మారిపోతున్నాయి. ఇప్పటివరకు సిటీలో ఆదిభట్ల, తుర్కయాంజల్, తుక్కుగూడ, శంషాబాద్ ఎయిర్ పోర్టు, ఇబ్రహీంపట్నం, మాల్, మేడ్చల్, కీసర, ఘట్ కేసర్, పెద్ద అంబర్పేట్, హయత్ నగర్, సుచిత్ర, బౌరంపేట్, శామీర్ పేట దాటి నగర పరిధి విస్తరించడంతో దేశంలో ఏ ప్రాంతానికి లేనంత డిమాండ్ హైదరాబాద్ రియల్ మార్కెట్ కు ఏర్పడింది. విశ్వనగరం వైపు శరవేగంగా దూసుకుపోతున్న సిటీలో విస్తృతంగా ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయి. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి భారీగా వలసలు వస్తున్న నేపథ్యంలో సొంతింటి కలలను సాకారం చేసుకునేందుకు శివారు ప్రాంతాలకు మొగ్గు చూపుతున్నారు. దీంతో తక్కువ ధరలో, ప్రశాంతమైన వాతావరణం, ఆధునిక హంగులు, అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులు ఉండే స్థిరాస్తులను కొనుగోలుదారులకు అందించేలా నిర్మాణ సంస్థలు ప్రాజెక్టులు చేపడుతున్నాయి.

సిటీ చుట్టూ వందల ఎకరాల్లో ఓపెన్ ప్లాటింగ్ వ్యాపారం నడుస్తోంది. ఇప్పటి వరకు వందల ఎకరాల్లో లగ్జరీ వెంచర్లను వినియోగదారులకు అందజేస్తునారు. సిటీ శివారులోనే విద్యాసంస్థలు, పారిశ్రామిక కేంద్రాలు ఏర్పాటు కావడంతో ఇబ్రహీంపట్నం, కొంగర కలాన్, మంగళ్ పల్లి, ఆదిభట్ల దుండిగల్, శామీర్ పేట వంటి ప్రాంతాల చుట్టూ భారీ వెంచర్లు అందుబాటులోకి వచ్చాయి. ఇదే తరహాలో జేబీ, వాసవి, రాజపుష్ప, అపర్ణ లాంటి బడా సంస్థలు చేపట్టిన ప్రాజెక్టుతో అయా ప్రాంతాల్లో రియల్ వ్యాపార రూపురేఖలు మారిపోయాయి. మార్కెట్లోకి వచ్చిన అనతికాలంలోనే 90శాతం ప్లాట్లపై లావాదేవీలు పూర్తి చేసుకునేలా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. శివారు ప్రాంతాల్లోని నాణ్యత, మౌలిక వసతులను అందించే విషయంలో ఏ మాత్రం రాజీపడకుండా వినియోగదారుల ప్రతి పైసకు విలువ వచ్చేలా ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుని మొదలుపెట్టడంతో ప్రస్తుతం సిటీ శివారు ప్రాంతాలు లగ్జరీ ప్రాజెక్టులతో దూసుకుపోతున్నాయి.




**వసతుల్లో రాజీపడకుండా**

హైదరాబాద్ వినియోగదారుల అభిరుచులపై పూర్తి అవగాహన ఉండటంతో... ఏమాత్రం రాజీపడకుండా ప్రాజెక్టు లాంఛ్ చేయాలని భావిస్తున్నాయి. ముఖ్యంగా గేటెడ్ కమ్యూనిటీలలో గ్రీనరీ, ఆంపీ థియేటర్, ల్యాండ్ స్కేప్ గార్డెన్, గేమింగ్ జోన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎలక్ట్రిఫికేషన్, సోలార్ ఫెన్సింగ్ వంటివే కాకుండా ఎయిర్ కండిషన్డ్ జిమ్, స్పా సెంటర్, స్విమ్మింగ్ పూల్, వరల్డ్ క్లాస్ సౌకర్యాలతో క్లబ్ హౌజ్ ను ఏర్పాటు చేస్తున్నాయి. ఓఆర్ఆర్ మీదుగా అనుసంధానం ఉండే ప్రాంతాలను ఎంపిక చేసుకొని ప్రాజెక్టులు చేపట్టడంతో కొనుగోలుదారులు కూడా ఇదొక ఫ్యూచర్ ఇన్వెస్ట్మెంట్ గా భావించి శివారులకు ఆసక్తి చూపుతున్నారు. సిటీలో ఇరుకైన గదుల్లో, స్వచ్ఛమైన గాలి కూడా పీల్చుకునేందుకు ఇబ్బంది పడే వాతావరణంలో ఉండాలనుకోవడం లేదు. ఆఫీస్ సిటీ సెంటర్ లో ఉన్నా... ఫ్యామిలీతో జీవనం సాగించేందుకు మాత్రం దూరంగా ఉండేందేకు మొగ్గుచూపుతున్నారు. సిటీలో ఉన్నంత మాత్రనా... రోజువారీ పనులు వదులుకుని షాపింగ్ మాల్స్, ఎంటర్ టైన్ మెంట్ చుట్టూ తిరిగే వారే చాలా తక్కువే ఉంటారు. వారంలో ఒకరోజు మాత్రం సిటీ దాటి వెళ్తున్నారు. ఇలాంటి విషయాలను దృష్టిలోనే పెట్టుకునే సిటీ జనాల లైఫ్ స్టయిల్ అనుగుణంగా ఫ్యామిలీతో కలిసి ప్రశాంత వాతావరణం ఉండేలా విల్లాలు, హైరైజ్ భవనాలను రియల్ సంస్థలు డిజైన్ చేస్తున్నాయి.

**శివారులన్ని హాట్ ఫేవరేటే..**

సిటీ ఈ స్థాయిలో డెవలప్ అవుతుందంటే ప్రధానమైనది ఇన్ ఫ్రాస్ట్రక్చర్. ఓఆర్ఆర్ చుట్టూ విశాలమైన రోడ్లు, మెరుగైన రవాణా వ్యవస్థ ఉండటంతో ఆ పరిసరాల్లో రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఏ నగరానికి కూడా లేని విధంగా సమతౌల్యంగా ఉండే వాతావరణంతో హైదరాబాద్ హాట్ ఫేవరేట్ గా ఉంది. అయితే ఇటీవల కాలంలో మెరుగు పడుతున్న ఇన్ ఫ్రా ఓఆర్ఆర్ చుట్టూ తమ ప్రాజెక్టులను కంపెనీలు తీసుకువస్తున్నాయి. ఈ క్రమంలోనే ఒఆర్ఆర్ చుట్టూ ఉన్న ప్రాంతాలన్నీ రానున్న రోజుల్లో రియల్ వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయి. వెస్ట్రన్ ఏరియాలో భూములకు పెరుగుతున్న డిమాండ్ తో... భూముల ధరలు తక్కువగా ఉండే ప్రాంతాల వైపు పయనిస్తోంది. ఈ క్రమంలో ఈస్ట్ వైపు ఉన్న ఉప్పల్, ఘట్ కేసర్, సాగర్ హైవే, ఆదిభట్ల, కొంగర కలాన్ వంటి ప్రాంతాలు హాట్ ఫేవరేట్. ఇప్పటికే ఈ ప్రాంతంలో వచ్చిన టీసీఎస్, టాటా సెజ్, ఏరోనాటిక్ పరిశ్రమకు అనువుగా ఉండే ఇన్ ఫ్రాస్ట్రక్చర్ తో ఇటువైపు వస్తున్నారు. వచ్చే రెండేళ్లలో పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలకు తగినట్లుగా రెసిడెన్షియల్ నిర్మాణాలకు డిమాండ్ ఉంది. ప్రస్తుతం ప్రతి ఎకర విస్తీర్ణంలో వచ్చే కమర్షియల్ స్పేస్ లో ఏడెకరాలలో రెసిడెన్షియల్ స్పేస్ నిర్మించాల్సి ఉంటుంది. ప్రస్తుతం చ. అడుగుకు 20వేల పైనే ఉండగా రెసిడెన్షియల్ సెగ్మెంట్ లోనూ కోర్ సిటీ తరహాలో ధర పలుకుతోంది.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

ఆదివారం,
18.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ హాల్ టికెట్స్ విడుదల

విశాలభారతి, స్టేట్ బ్యూరో: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్స్ విడుదల అయ్యాయి. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు తమ కాలేజీల్లో హాల్ టికెట్స్‌ను తీసుకోవచ్చు. లేదంటే ఇంటర్మీడియట్ బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. హాల్ టికెట్స్ కోసం www.tgbie.cgg.gov.in ను సంప్రదించొచ్చు.ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 22 నుంచి 28 వరకు రెండు సెషన్లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు మొదటి సంవత్సరం పరీక్షలు , ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు జరగనున్నాయి.

# పటాన్ చెరు విద్యార్థులకు సువర్ణ అవకాశం..

- ఈ విద్యా సంవత్సరం నుండే పటాన్ చెరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తరగతులు
- పారిశ్రామికవాడకు అనుగుణంగా కోర్సులు
- ఆరు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు,విశాలభారతి**

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం డిగ్రీ కళాశాల భవనంలో 2025 2026విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తరగతులు ప్రారంభించబోతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం సంబంధిత అధికారులతో కలిసి డిగ్రీ కళాశాల భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పటాన్ చెరు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగంగా నియోజకవర్గంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తూ గత ప్రభుత్వం జీరో జారీ చేసింది అని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం కళాశాల ఏర్పాటు కోసం ప్రభుత్వ భూమితో పాటు అధ్యాపక పోస్టులు, కోర్సులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు పటాన్చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలో తాత్కాలికంగా తరగతులు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ విభాగంలో 60 సీట్లు చొప్పున 180 సీట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ఇప్పటికే పాలిటెక్నిక్ కళాశాలకు. AICTE గుర్తింపుతో పాటు SBTET అఫ్లియేషన్ రావడం జరిగిందని తెలిపారు. 35 రెగ్యులర్ పోస్టులు..52 ఔట్సోర్సింగ్ పోస్టులు మంజూరయ్యాయని తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలో చదివిన విద్యార్థులకు స్థానిక పారిశ్రామిక వాడలోని జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమల్లో ఉద్యోగ ఉపాధ్యాయ అవకాశాలు మెండుగా లభిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ.ఇంజనీరింగ్ కళాశాలగా అప్గ్రేడ్ చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తుల వెరిఫికేషన్‌ను త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**మద్దూర్, విశాలభారతి:**

భూభారతి పైలెట్ ప్రాజెక్టు మద్దూర్ మండలానికి సంబంధించిన భూ భారతి దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు.శనివారం మద్దూర్ తహాసిల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న భూ సమస్యల దరఖాస్తుల వెరిఫికేషన్ ను కలెక్టర్ పర్యవేక్షించారు.భూ భారతి పైలెట్ ప్రాజెక్టు మద్దూర్ మండలంలో వచ్చిన మొత్తం దరఖాస్తుల వెరిఫికేషన్ వేగంగా చేయాలన్నారు. ఫీల్డ్ వెరిఫికేషన్,ప్రొసీడింగ్స్,ల్యాండ్ సర్వే ఎంత వరకు వచ్చిందని భూ భారతి ప్రత్యేక అధికారి యాదగిరిని అడిగి తెలుసుకున్నారు అలాగే తిరస్కరించిన దరఖాస్తులపై ఖచ్చితమైన స్పష్టత ఉండాలన్నారు.ఎందుకు తిరస్కరించామనే కారణాన్ని రైతులకు చెప్పాల్సిన అవసరం ఉంటుందన్నారు.నెలాఖరు నాటికి వంద శాతం దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు.భూ సమస్యలకు చట్ట ప్రకారం పరిష్కారం చూపే బాధ్యత అధికారులదేనని ఆమె స్పష్టం చేశారు. విరాసత్ దరఖాస్తుల పరిష్కారానికి నిబంధనలను అనుసరించాలన్నారు. పైలెట్ మండలంలో అధికారులు భూ సమస్యలకు చూపించే పరిష్కారాలనే మళ్ళీ కొత్తగా ఎంపిక చేసే ఒక్కో పైలెట్ మండలాలలో వర్తింపచేసే అవకాశం ఉంటుందని ,అందుకే ఒకటికి రెండుసార్లు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో ఆర్డీఓ రామచంద్రనాయక్,భూ భారతి ప్రత్యేక అధికారి యాదగిరి, మద్దూరు,కొత్తపల్లి,కోస్గి తహాసిల్దారులు,మహేశ్ గౌడ్,జయరాములు,బక్క శ్రీనివాస్,దయాకర్ రెడ్డి మరియు రెవెన్యూ బృందం పాల్గొన్నారు.



# చిన్నరాయిగూడెం అడ్ హాక్ కమిటీని ఎన్నుకున్న డిసిఓ అధికారులు

**మణుగూరు, విశాలభారతి:**

మండలంలోని చిన్నరాయిగూడెం గ్రామంలో డిసిఓ కార్యాలయం నుండి డి.రాజు అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎ ఎస్ ఆర్ హనుమాన్ సీనియర్ ఇన్స్పెక్టర్ పర్యవేక్షణలో సొసైటీ సభ్యుల మధ్య అడ్ హాక్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఈ కమిటీలో 154 మంది సొసైటీ సభ్యుల నుండి సమ్మక్క సారక్క ఇసుక ట్రైబల్ సొసైటీ బైలా ప్రకారం ముగ్గురు కమిటీ సభ్యులుగా ఎన్నుకోబడాలి కానీ రెండు వర్గాల నుండి నలుగురు పోటీకి రావడంతో ఎన్నిక అనివార్యమైంది. ముగ్గురు సభ్యులకి 109 మంది ఏకగ్రీవంగా,ఒక సభ్యురాలికి ఏ విధమైన మద్దతు లభించకపోవడంతో సొసైటీ సభ్యులు ప్రతిపాదించిన ఆ ముగ్గురిని అధికారులు ఏకగ్రీవంగా అడ్ హాక్ కమిటీ సభ్యులుగా సొసైటీ సభ్యుల మధ్యలో సంతకాల సేకరణతో తీర్మానించారు. పూర్తిగా పారదర్శకంగా జరిగిన ఈ ఎన్నిక వీడియో కెమేరా పర్యవేక్షణలో రికార్డు చేయబడింది.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై మనీషా తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.ఏదైనా విషయంపై రిపోర్టు కోరుతూ కొంతమంది అధికారులతో ఏర్పాటు చేసే ప్యానెల్‌నే అడ్ హాక్ కమిటీ అంటారు. ఏదైనా అంశంపై తుది రిపోర్టు సమర్పించడంతో అడ్ హాక్ కమిటీ పని పూర్తవుతుంది. అంటే తాత్కాలిక కమిటీ అని అర్థం చేసుకోవాలి. ఈ కమిటీ సమ్మక్క సారక్క ఇసుక ట్రైబల్ సొసైటీ బైలా ప్రకారం నెల రోజులు ఉంటుంది. ఈ నెల రోజుల్లోపు ఈ ముగ్గురు సభ్యులు ఎలక్షన్ పెట్టి పూర్తి సొసైటీ సభ్యులను ఎన్నుకుంటారు అని అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# రైతుల సంక్షేమమే సహకార సంఘాల లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య
- తుర్కయంజాల్ సహకార సంఘం సర్వసభ్య సమావేశం
- రైతులకు రూ. 1.25 కోట్ల రుణాలు మంజూరు

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి :**

రైతుల సంక్షేమం, అభివృద్దే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేస్తాయని డీసీసీబీ చైర్మన్, తుర్కయంజాల్ సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. శనివారం తుర్కయంజాల్ మున్సిపల్ కేంద్రంలోని ది తుర్కయంజాల్ సహకార సంఘం సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశములో నూతన సభ్యులుగా 11 మంది రైతులను చేర్చుకున్నారు. అనంతరం సంఘం చైర్మన్ సత్తయ్య మాట్లాడుతూ సకాలంలో అప్పులు చెల్లించిన సభ్యులకు, ఖాతాదారులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రైతులు ఇప్పటి వరకు తీసుకున్న అన్ని రకాల రుణాలను, కిస్తులను సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. 9 మంది రైతులకు రూ. 1.25 కోట్ల అప్పులు మంజూరు చేసినట్లు తెలిపారు. సంఘం 202425 ఆర్థిక సంవత్సరం ముగింపు లెక్కలు ఆమోదించినట్లు వివరించారు. అదే విధంగా ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెల జామ ఖర్చులు, సంఘ సభ్యుల ఇతర అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆమోదించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు కొత్త రాంరెడ్డి, చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవరెడ్డి, కుతాడి నర్సింగ్ రావు, వంగేటి లక్ష్మారెడ్డి, కోండ్రు స్వప్న, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణరెడ్డి, సామ సత్య నారాయణ రెడ్డి, కార్యదర్శి వై రాందాస్ పాల్గొన్నారు.

# ఇద్దరు బాలురు అదృశ్యం

**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**



బీహార్ నుండి వలస వచ్చి మదర్సనందు చదువుకుంటున్నటువంటి ఇద్దరు బాలులు అదృశ్యమైన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుందని ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు.వివరాల్లోకి వెళితే పెద్ద అంబర్పేట్ మున్సిపల్ పరిధిలో ఉన్నటువంటి హతిగూడ కుంట్లూర్ మిస్బాహుల్ హుడా రహిమియా మదర్సా నందు హబీబుల్లా తండ్రి ఇస్మాయిల్ వయసు 13 సంవత్సరాలు కలిగిన బాలుడు అతనితోపాటు సఫీయుల్ల తండ్రి ఇస్మాయిల్ వయసు 11 సంవత్సరాలు బీహార్ నుండి వలస వచ్చి మదర్సనందు చదువుకుంటున్నారని, ఏప్రిల్ నెలలో ఇద్దరు బాలురు కూడా వారి స్వస్థలం బీహార్ వెళ్లి మరల తేదీ మే 6న మదర్స నందు వారి తండ్రి మహమ్మద్ ఇస్మాయిల్ వదిలి వెళ్లడం జరిగిందని తేదీ 08.05.2025 రోజున దాదాపు తొమ్మిది గంటల సమయంలో ఇద్దరు బాలులు మదర్స నుండి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోవడం జరిగిందని వారి గురించి చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికిన వారి స్వస్థలానికి వెళ్లారేమోనని ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకోవడం జరిగిందని వారి గురించి ఎటువంటి ఆశలకి లభించకపోవడంతో వారి తండ్రి మహమ్మద్ ఇస్మాయిల్ హయత్ నగర్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు



# ధర్మారం కోతి దేవుడి ఆలయంలో మొక్కులు తీర్చుకున్న గురడి కాపులు..

**ఆర్మూర్,విశాలభారతి:**

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్ర పరిధిలోని కోటార్ మూర్ పెర్కిట్ ఏరియాలకు చెందిన గురుడికాపు కులస్తులు శనివారం నిర్మల్ జిల్లాలోని లక్ష్మణ్ చందా మండలం ధర్మారం గ్రామంలోని కోతి దేవుడి ఆలయంలో అత్యంత భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి సంవత్సరం పంటల సాగుకు ముందు మా ఏరియా కు చెందిన పలువురు రైతులందరం ఈ కోతి దేవుడి ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకోవడం అనాదికాలం నుంచి వస్తుందని రైతులు చెప్పారు. ఆలయ పరిసరాల్లో సిరా నైవేద్యాలను భక్తిశ్రద్ధలతో తయారుచేసి ఆలయంలోని హనుమాన్ ప్రతిరూపమైన దేవుడికి వేద పండితుడి సమక్షంలో నైవేద్యాలను సమర్పించారు. అనంతరం మురడి కాపు కులస్తులందరూ వంటలు చేసుకుని వారి వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలోనే ఆరగించారు. ప్రతి సంవత్సరం ఆర్మూర్ ఏరియాలోని పలు దేవత మూర్తుల మొక్కులు తీర్చుకున్న తరహాలోనే నిర్మల్ జిల్లాలోని లక్ష్మణ్ చందా ధర్మారం గ్రామంలో గల కోతి దేవుడి ఆలయంలో సైతం ముక్కులు తీర్చుకొని పంటల సాగును ప్రారంభిస్తామని రైతులు చెప్పారు. రైతులమంతా సాగు చేసే పంటలకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని దేవుడికి మొక్కుకున్నట్లు రైతులు చెప్పారు. కోతి దేవుడి ఆలయానికి మొక్కులు చెల్లించేందుకు వెళ్లిన రైతుల్లో అల్లూరి పెద్ద భూమన్న యమునా, చిన్నవ్వ దంపతులు, యాళ్ల గంగారెడ్డిపద్మ దంపతులు, ఇట్టెడి మోహన్ రెడ్డి పద్మ దంపతులు, అల్లూరి మహిపాల్ లావణ్య దంపతులు, ఇట్టెడి సాయి రెడ్డి కావ్య దంపతులు, ఇట్టెడి సుమన్ రెడ్డి మమత రెడ్డి దంపతులు, గోపిడి సుజిత్ రెడ్డి వసంత రెడ్డి దంపతులు, తదితరులు, కుటుంబాల పెద్దలు నర్సు బాయి, రాజు భాయి, సాయమ్మ వారి కుటుంబాల సభ్యులు ఉన్నారు.

# 19 సంవత్సరాల యువకుడు అదృశ్యం

**విశాలభారతి, పెద్ద అంబర్ పేట:**



తన తల్లి వనిచర్ల పద్మ యొక్క జీతం డబ్బులు వీడ్రా చేసుకోవస్తానని చెప్పి వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుందని ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు. వివరాల్లోకి వెళితే కుంట్లూరు గ్రామ పరిధిలో ఉన్నటువంటి రావినారాయణరెడ్డి కాలనీ కి చెందిన వనిచర్ల సాయికిరణ్ తండ్రి ప్రవీణ్ వయస్సు 19 సంవత్సరాలు కలిగిన వ్యక్తి తన తల్లి వనిచర్ల పద్మ యొక్క జీతం డబ్బులు ఏటీఎం నుండి విత్ డ్రా చేసుకొని వస్తానని చెప్పి తేదీ 15.05.2025 రోజు రాత్రి 7 గంటలకు బయటికి వెళ్ళాడు. కానీ ఇప్పటివరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో సాయికిరణ్ గురించి తన తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు తన స్నేహితుల వద్ద మరియు బంధుమిత్రుల వద్ద ఆచూకీ కోసం బ్రతకడం జరిగిందని ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో సాయికిరణ్ తల్లి వనిచర్ల పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# ఉద్యమాలే ఊపిరిగా పోరాటమే ప్రాణంగా సిపిఐ ప్రయాణం

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ వ్యాఖ్య

**గరిడేపల్లి, విశాలభారతి:**

ప్రజా ఉద్యమాలే ఊపిరిగా ప్రజా పోరాటాలే ప్రాణంగా గత వంద సంవత్సరాలుగా సిపిఐ ప్రయాణిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శనివారం నాడు సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల సిపిఐ మహాసభ గానుగబండ గ్రామంలో జరిగిన సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా, ప్రజా సమస్యలే అజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సిపిఐ అని, శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని దున్నేవాడికి భూమి దక్కాలని శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించినపార్టీ సిపిఐ అని ఆయన సగర్వంగా ప్రకటించారు. సూర్యాపేట జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గరిడేపల్లి మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పట్ల ఎప్పటికప్పుడు సిపిఐ పార్టీ స్పందించి పోరాటలు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. మహాసభకు త్రిపురం సుధాకర్ రెడ్డి పోటు పూర్ణ చంద్రరావు అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు యల్లావుల రాములు బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మండవ వెంకటేశ్వర్లు గుండు వెంకటేశ్వర్లుకడియాల అప్పయ్య కుందూరు వెంకటరెడ్డి పంగ గోవింద్ ప్రజా నాట్యమండలి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపనబోయిన వెంకటేశ్వర్లు యడ్ల అంజన్ రెడ్డి అమరారపు పున్నయ్య, రేమిడాల రాజు బిళ్ల కనకయ్య పాల్గొన్నారు.



# లక్ష్మినరసింహ స్వామిని దర్శించుకున్న పసుపులేటి పవన్ కుమార్

**రాజంపేట,విశాలభారతి:**

భువనగిరి పల్లెలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు శనివారం రోజున స్వామివారి అభిషేకానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రివర్యులు పసుపులేటి బ్రహ్మయ్య తనయుడు పసుపులేటి పవన్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు తదుపరి స్వామివారికి అభిషేకం పసుపులేటి పవన్ కుమార్ చేతులమీదుగా అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులచే మాజీ మంత్రి తనయుడు పసుపులేటి పవన్ కుమార్ కీ ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సిగా జయరాం, పసుపులేటి చంద్రశేఖర్, పసుపులేటి నాగేంద్ర ఇతర భక్తులు అభిషేకములో పాల్గొన్నారు.



## ఇంజినీరింగ్ కళాశాలలో ఫీజులు పెంపు తగదు

- పేద, మధ్యతరగతి విద్యార్థులపై గొప్ప భారం
- ఉస్మానియా యూనివర్శిటీ రిజిస్ట్రార్ వినతి
- ఆడిట్ నివేదికలను యూనివర్శిటీ వెబ్‌సైటులో పెట్టాలి
- ఏఐఎస్ఎఫ్

**హైదరాబాద్, విశాలభారతి:**

ఉస్మానియా యూనివర్శిటీ పరిధిలోని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలో ఫీజుల పెంపు తగదని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా నిరసన తెలిపింది. ఈ నేపథ్యంలో ఏఐఎస్ఎఫ్ నేతలు ఉస్మానియా యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డిని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యూనివర్శిటీ పరిధిలోని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉన్న సౌకర్యాలపై తగిన సమాచారం బహిర్గతం చేయాలని, యూనివర్శిటీ అధికారులు తనిఖీలు చేసినప్పుడు ఇచ్చిన సర్టిఫికెట్లను, రాటిఫ్లికేషన్ చేసిన అధ్యాపకుల వివరాలను, అలాగే ఆడిట్ నివేదికలను యూనివర్శిటీ వెబ్ సైటులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఏవిధమైన మౌలిక సదుపాయాలు లేకుండానే కళాశాలలు ఫీజులు పెంచుతున్నాయంటే అది పేద, మధ్యతరగతి విద్యార్థులపై గొప్ప భారం మోపే కుట్ర అని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విద్యను రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మలచినట్లు ఈ పరిస్థితులు చూపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆయా కళాశాలలపై పూర్తి స్థాయి తనిఖీలు జరిపి, విద్యా ప్రమాణాలు పాటించని సంస్థలపై చర్యలు తీసుకోవాలని, పేద విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య అందుబాటులో ఉండేలా ఫీజు తగ్గింపుపై యూనివర్శిటీ చొరవ చూపాలని ఏఐఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, గ్యార నరేష్, రఘురాం, ఓయూ కార్యదర్శి నెల్లి సత్య పాల్గొన్నారు.

## నూతన వధువును ఆశీర్వదించిన పల్లా సుందర్ రాంరెడ్డి

**దేవరుప్పుల, విశాలభారతి:**



మండలం, నీర్మాల గ్రామానికి చెందిన మేడ బిక్షపతిసుశీల దంపతుల కూతురు నందిని ని వారి ఇంటికి వెళ్ళి నూతన వధువును ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి. వారి వెంట బిఆర్ఎస్ మండల,గ్రామ నాయకులున్నారు.

GENERAL NEWS





# ప్రతి కాలనీకి రక్షిత మంచినీరు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి**

నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలకు సైతం రక్షిత మంచి నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో గల అపార్ట్మెంట్ వాసుల కోసం 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న పైపులైన్ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి మంచినీరు అందించాలని లక్ష్యంతో నూతన రిజర్వాయర్లు, పంపు హౌస్‌లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఉపాధి అవకాశాలకు అనుగుణంగా నూతన కాలనీలు ఏర్పాటు అవుతున్నాయని.. వాటిలో మౌలిక వస్తువుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, కృషి డిఫెన్స్ కాలనీ అధ్యక్షులు అమరేందర్, ప్రధాన కార్యదర్శి మాణిక్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

**బండారి లక్ష్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే జీఎంఆర్..**

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోదరుడు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి ఇటీవల మరణించిన నేపథ్యంలో.. లక్ష్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి.. ప్రగాఢ సానుభూతి తెలియజేసిన పటాన్ చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు. అనంతరం రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఉప్పల్ నియోజకవర్గం తొలి ఎమ్మెల్యేగా పనిచేయడంతో పాటు.. హైదరాబాద్ రాజకీయాల్లో తనదైన పాత్ర పోషించిన మహోన్నత వ్యక్తి రాజిరెడ్డి అని కొనియాడారు. ఆయన మరణం ఉప్పల్ ప్రజలకు తీరని లోటని అన్నారు.



## చట్టసభలలో బీసీ రిజర్వేషన్లు సాధించాలి

- బీసీలు చైతన్యంగా పోరాటం చేయాలి
- "మన ఆలోచన సాధన సమితి" కోర్ కమిటీ సభ్యుడు పెద్దవూర బ్రహ్మయ్య

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి**

చట్టసభలలో బీసీ రిజర్వేషన్లు సాధించేదాకాబీసీల యుద్ధం కొనసాగుతుందని "మన ఆలోచన సాధన సమితి" కోర్ కమిటీ సభ్యుడు పెద్దవూర బ్రహ్మయ్య అన్నారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలాలలో గ్రామాలలో పర్యటిస్తూ బీసీలను చైతన్య పరచడానికి ఒక ప్రణాళిక ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అన్ని కులాల వారిని మమేకమై బీసీలమని చెప్పుకునే వరకు బీసీలకు అవగాహన కల్పిస్తామన్నారు. మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపకులు కటకం నర్సింగ్ రావు నడుం బిగించి బీసీలను చైతన్య పరుస్తూ బీసీల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. వారికి యావత్ తెలంగాణ బీసీలు మద్దతు ఇవ్వాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాశీనాథ్ కేతూరి రవి, అక్కినపల్లి గణేష్, నాగిల్ల రమేష్ ,దశరథ ,రఘుపతి గౌడ్, వెంకటేష్‌యాదవ్, శివ ,భగవత్ చారి, సునీల్ ,అనంతయ్య ముదిరాజ్ ,పాండు , సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్య

- ప్రధానోపాధ్యాయులు భీమ్లా నాయక్

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి :**



ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన ఉంటుందని మంచాల మండలంలోని జాపాల ఉన్నత ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు భీమ్లా నాయక్ అన్నారు. శనివారం జాపాల గ్రామంలో ప్రధానోపాధ్యాయులు భీమ్లా నాయక్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో ఎక్కువ డబ్బులు ఖర్చు చేసి చదివిపించడం వల్ల ఉపయోగం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి, ప్రయివేట్ పాఠశాలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాల గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల పట్ల ఆసక్తి కలిగేలాగా చేస్తే అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉన్నట్లుగా గమనించామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు ఉచితంగా లభిస్తున్నందున పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, డిజిటల్ విద్య ,కంప్యూటర్ విద్య అందిస్తూ ఉచిత నోట్ బుక్స్, మధ్యాహ్న భోజన పథకం, ఉచిత యూనిఫామ్స్ అన్ని రకాల సౌకర్యాలు అందిస్తున్నప్పటికిని రోజు రోజుకు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడం పట్ల కాస్త విచారం ఉన్నప్పటికీని, ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కలిసి బడిబాట నిర్వహిస్తూ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచడం కొరకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయానంద్, వనజ, లింగం పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనల ప్రకారమే
## స్కూలు బస్సులు నడపాలి

- రవాణా శాఖ అధికారికి వినతి పత్రం అందజేత

**మణుగూరు, విశాలభారతి:**



ప్రభుత్వ నిబంధనల ప్రకారమే స్కూలు బస్సులు నడపాలని, జిల్లా లోని ప్రైవేట్ స్కూల్స్ బస్సులు పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించకుండా చూడటం డ్రైవర్లకు చట్టబద్ధమైన హక్కులు ఖాకీ యూనిఫామ్ ఇవ్వాలని కోరుతూ శనివారం జిల్లా రవాణా శాఖ అధికారి సంగం వెంకట పుల్లయ్య కి భద్రాచలంలోని ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందజేసినట్లు సామాజిక సేవకులు కర్నే బాబురావు విలేకరులకు తెలిపారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఉన్నటువంటి వివిధ ప్రైవేట్ స్కూల్ బస్సులో నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి విద్యార్థిని విద్యార్థులను ఎక్కిస్తున్నారనీ, బస్సుల ఫిట్నెస్, ఇన్సూరెన్స్ ఫోర్సులో ఉందా లేదా తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బస్సులు ఉన్నాయా లేదా చూడాలి, అలాగే విద్యార్థిని విద్యార్థుల భద్రతపై సరైన అవగాహన ఉండటంతో పాటు సరైన డ్రైవింగ్ అలవాట్లు ఉన్న నైపుణ్యత డ్రైవింగ్ స్కిల్స్ ఉన్న డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న డ్రైవర్లను నియమించే విధంగా చూడాలి అని తెలిపారు. వారికి తగు శిక్షణ ఇప్పించాలి ప్రత్యేకించి రాష్ డ్రైవింగ్ సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయకుండా చూడాలి దీనితో బాటు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు కూడా డ్రైవర్లకు తగు గుర్తింపు ఇవ్వాలి, చట్టబద్ధ హక్కులు అమలు చేయాలని ప్రతి డ్రైవర్ కి రెండు జతల యూనిఫాం బూట్లు ఇప్పించే విధంగా ప్రవేట్ స్కూల్ యజమాన్యాలకు తగు ఆదేశాలు జారీ చేయగలరని ఆయన విజ్ఞప్తి చేశారు.



## బుగ్గ గ్రామపంచాయతీగా శ్రీకారం

- ఎమ్మెల్యే పాయంకి ఘన స్వాగతం పలికిన బుగ్గ గ్రామ ప్రజలు
- స్థల దాత కుంజా పగిడయ్య ను సన్మానించిన ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, విశాలభారతి:**

మండలంలోని బుగ్గ గ్రామంలో 20 లక్షల ఖర్చుతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయితీ కార్యాలయాన్ని శనివారం నాడు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం రెవిన్యూ, విద్య, వైద్యం, ఫారెస్ట్, ఇరిగేషన్, పవర్, అంగన్వాడీ, వ్యవసాయ, ఇలా అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి ప్రజల సమక్షంలోనే పలు సమస్యలను పరిష్కరించారు, వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభించుకోవడం దత్తత గ్రామమైన బుగ్గ గ్రామంలో 6 కోట్ల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని,కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలుపరిచేందుకు కృషి చేస్తుందని ,బుగ్గ గ్రామపంచాయితీలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని, గ్రామ పంచాయతీ అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని 2004 లో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బుగ్గ గ్రామం పగిడేరు పంచాయతీ పరిధిలో ఉండేదని దానివల్ల ప్రజలు ఇబ్బంధీ పడుతూ ఉండేవారు అని ఇకపై ఇబ్బంది పడకూడదని బుగ్గ గ్రామపంచాయతీ గా శ్రీకారం చుట్టాలని బుగ్గ గ్రామం లో రేషన్ షాపు లేక ప్రజలు మణుగూరు సమితి సింగారం వచ్చి రేషన్ తీసుకునే వరు అని ప్రజలు ఇబ్బందులను చూసి బుగ్గ గ్రామంలోనే రేషన్ షాపుని ప్రారంభించామని తెలియజేసారు.



## సమీక్ష సమావేశం నిర్వహించిన ఎంపీడీవో

- ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక పారదర్శకంగా జరగాలి
- ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చెరవేయడంలో నిర్లక్ష్యం వద్దు
- మంచాల ఎంపీడీవో ఎ. బాలశంకర్

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

మంచాల మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో ఎ. బాలశంకర్ శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంజిఎన్ఆర్ ఈజిఎస్ , ఎస్బిఎం కార్యకలాపాలు , ఇందిరమ్మ ఇండ్ల అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చెరవేయడంలో నిర్లక్షంగా వ్యవహరించకూడదన్నారు. ఈ కార్యక్రమము లో మండల పంచాయతీ అధికారి కె.ఉమారాణి, డి. ఏం.అబ్దుల్ అజీమ్. సూపరింటెండెంట్ ,మందాల ,మండల కార్యాలయ సిబ్బంది, విమల, ఈ.సి మరియు పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



## అంగ రంగ వైభవంగా భక్తాంజనేయ స్వామి శోభాయాత్ర

**దేవరుప్పుల, విశాలభారతి:**

మండలంలో సింగరాజుపల్లి గ్రామంలో ఈనెల 18 నుండి 22 వరకు శ్రీ భక్తాంజనేయ స్వామి బృందం ఆధ్వర్యంలో జరుగు శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా శనివారం హనుమాన్ దీక్ష బృందం పారాయణం భక్త బృందం శోభాయాత్రను పండితులు పెండం ప్రసాద్, సింహాద్రి, లతో పూజలు నిర్వహించి, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూలతో అలంకరించి, కోలాటాల పాటలతో డిజె పాటలతో సింగరాజు పల్లి గ్రామం వీధుల గుండా శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని భక్తులు స్వామివారికి నీళ్లు ఆరగించి, కొబ్బరికాయలు కొట్టి, హారతులు పట్టి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ భక్త బృందం, శ్రీరామ కమిటీ బృందం,మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ రెడ్డి, జోగు శ్రీశైలం, కారుపోతుల మధు, అజ్మీర మల్లేష్, జటంగి పరశురాములు, జోగు అర్జున్, జటంగి వినయ్, గర్దాస్ దామోదర్, దీకొండ విష్ణు, జాటోత్ మోహన్, చింతకింది మహేష్, విక్రమ్ రాథోడ్, ఇప్ప రాజు,మధు,శేఖర్, గ్రామ ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
18.05.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
6
vishalabharathi Telugu Daily
GENERAL NEWS



# చలో కరీంనగర్

- హిందూ ఏక్తాయాత్రకు వేలాదిగా తరలిరండి
- బిజెపి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్

**విశాలభారతి,ఎల్కతుర్తి:**

గురువారం రోజున హనుమాన్ జయంతి సందర్భంగా కేంద్ర మంత్రి వర్యులు కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ పిలుపు మేరకు ప్రతి గ్రామాల నుండి పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు చెందిన ప్రజలు వేలాదిగా తరలిరావాలని పిలుపునివ్వడం జరిగింది దీనిని ఉద్దేశించి బిజెపి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ హిందువులు ఏకం అయే సమయం ఆసన్నం అయినది కావున హనుమాన్ జయంతి సందర్భంగా కరీంనగర్ లో నిర్వహిస్తున్న హిందూ ఏక్తా యాత్ర మే 22 గురువారం రోజున ప్రతి ఒక్క హిందువ సాయంత్రం 4 గంటల వరకు కరీంనగర్ వైశ్య భవన్ కు చేరుకొని హిందూ ఏక్తాయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని మరియు హిందూ మనుగడను చాటుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానీ పత్రిక విలేకరుల సమక్షంలో తెలుపడం జరగడం జరిగింది ఈ కార్యక్రమంలో కంచర్ల శంకరయ్య. జనగాం కిష్టయ్య. ముష్క వెంకటేష్. ఆడపు శ్రీ వర్ధన్.చిదురాల వెంకటేష్. మధుకర్ రావు. ఠాకూర్ శ్యాంసింగ్ అల్లి కుమార్ రమణాచారి ఎర్రోళ్ల రాజు మధుకర్ రెడ్డి పోలు నరేష్ మాట్ల జయేందర్ సాయి తేజ కిరణ్ అశోక్ శ్రీకాంత్ మంతుర్తి తిరుపతి విజయ్ కుమార్ సూర్యనారాయణ కోడెం రమేష్ పవన్ కుమార్ పవన్ కుమార్ గడ్డం నరేష్ తంగళ్ళపల్లి శ్రీనివాస్ బొక్కలపాటి కుమార్ గొర్రె అరవింద్ శ్రీనివాస్ నాగరాజు రమణారెడ్డి విజయ్ కుమార్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## పరవళ్లు తొక్కుతున్న బొగత జలపాతం



**వాజేడు, విశాలభారతి:**

మండల పరిధి చీకుపల్లి గ్రామపంచాయతీ బొగత జలపాతం శుక్రవారం రాత్రి ఎగువ ప్రాంతంలో గుట్టల పై కురిసిన వర్షానికి చీకుపల్లి బోగత జలపాతం పరవళ్ళు తొక్కుతుంది. గుట్టలపై వర్షం అధికంగా పడటంతో బోగత జలపాతానికి నీరు చేరుకోవడం జలపాతాన్ని చూసిన పర్యటకులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.





# నందనవనంలో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయిస్తాం

- నందనవనంలో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయిస్తాం
- మధుయాష్కీ గౌడ్
- హస్తినాపురం డివిజన్ లో పర్యటించి సమస్యలు తెలుసుకున్న మధుయాష్కీ, జెడ్సీ, కార్పొరేటర్

**ఎల్బీనగర్ విశాలభారతి:**

నందనవనంలో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయించి స్థానికులకు రక్షణ పరంగా ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామని, ఇందుకు రాచకొండ పోలీస్ కమిషనర్ తో మాట్లాడుతానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. హస్తినాపురం డివిజన్లోని పలు కాలనీలలో ఈ రోజు ఉదయం మధుయాష్కీ గౌడ్ పర్యటించారు. జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్, కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తో కలిసి అగ్రికల్చర్ కాలనీ, నందనవనం, భూపేష్ గుప్తా నగర్ కాలనీలలో సమస్యలు తెలుసుకున్నారు. నందనవనం బస్తీ లో శ్మశాన వాటిక లో అభివృద్ధి పనులు నిలిచిపోయి తీరును వివరించగా.. సమస్య పరిష్కరించి తొందరగా పనులు పూర్తి అయ్యేలా చూడాలని జెడ్సీకి సూచించారు. భూపేష్ గుప్తా నగర్ ప్రభుత్వ స్థలాన్ని కబ్జాల నుంచి కాపాడాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు వచ్చి సమస్యలను వివరిస్తూ పరిష్కరించాలని వినతి పత్రాలను అందజేశారు. మధుయాష్కీ మాట్లాడుతూ.. స్థానికంగా యువత డ్రగ్స్ బారిన పడకుండా నివారించేందుకు కౌన్సిలింగ్ నిర్వహించి చర్యలు చేపడతామన్నారు. పోలీస్ ఔట్ పోస్టు ద్వారా మహిళలకు పూర్తి రక్షణ ఉంటుందన్నారు. ఖాళీ పార్క్ స్థలాలలో ఆట వస్తువులు, ఓపెన్ జిమ్ లు ఏర్పాటు చేసి పిల్లలకు, పెద్దలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేస్తామన్నారు. వ్యాధులు ప్రబలకుండా వర్షాకాలంలోపు డ్రైనేజీ , వరద నీటి, శానిటేషన్ తదితర అన్ని రకాల చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించినట్టు పేర్కొన్నారు. అక్కడక్కడ కొంత శానిటేషన్ సమస్యలు కనిపించాయని, సిబ్బంది కొరతను తీర్చి ప్రజలకు ఇబ్బందులు తొలగించేలా చూస్తామన్నారు. భూపేష్ గుప్తా నగర్ లోని ప్రభుత్వ స్థలానికి ప్రహరీ నిర్మించి కబ్జాల నుంచి రక్షిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో, వారికి మౌలిక సదుపాయాలు కల్పించడంలో ముందుంటుందని వివరించారు. జెఎన్ఎన్ యూఆర్ఎం ఇళ్ల వివాదాన్ని పరిష్కరించేందుకు ఇప్పటికే కలెక్టర్ తో మాట్లాడినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి , దేరంగుల కృష్ణ , దుర్గయ్య గౌడ్, మెరుగు రమేష్ రెడ్డి , విజయ భాస్కర్ రెడ్డి,నాగార్జున రెడ్డి, గోపగొని లతా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# అమ్మను మించిన దైవము లేదు

- మాతృదేవోభవ అనే మాటకు నిలువెత్తు నిదర్శనం అమ్మ
- ఉప్పల శ్రీనివాస్ గుప్త.

**ఎల్బీనగర్ విశాలభారతి:**

అమ్మను మించిన దైవము లేదు. మాతృదేవోభవ అనే మాటకు నిలువెత్తు నిదర్శనం అమ్మ అని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు.తెలంగాణ రాష్ట్ర అవాప మహిళ విభాగ్ ఆధ్వర్యంలో అవాప మహిళ విభాగం అధ్యక్షురాలు శిల్పా అధ్వర్యంలో జరిగిన వేద ఆశీర్వాదం, పాద పూజ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. వివిధ ఆటల్లో గెలుపొందిన మహిళ సోదరీమణులకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో అవాప స్టేట్ ప్రెసిడెంట్ మాలిపేద్ది శంకర్ ,ఆర్గనైజర్ కార్యదర్శి కట్ట రవి కుమార్ గుప్త, ఐవిఫ్ బాచుపల్లి ప్రెసిడెంట్ నవీన్, ప్రధాన కార్యదర్శి పోల శ్రీధర్ ,పృథ్వీ రఘువనిషి , పువ్వాడ హారిక ప్రియాంక, కోశాధికారి పద్మజ తదితరులు పాల్గొన్నారు.



# వ్యవస్థీకృత పోరాటం సాగించిన వీరబ్రహ్మేంద్రస్వామి

- ఆచార్య ఎన్ గోపి

**విశాలభారతి, ఓయూ**

వీరబ్రహ్మేంద్రస్వామి ప్రజలలో సాంస్కృతిక జాగృతినిరగిలించారని, ఒకవ్యవస్థీకృత పోరాటాన్ని బలంగా సాగించారని ప్రొఫెసర్ ఎన్. గోపి పేర్కొన్నారు. శనివారం ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ విభాగం కాన్ఫరెన్స్ హాల్లో బీసీ సెల్ ఆధ్వర్యంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ధర్మనిధి ప్రసంగంచేశారు. తొలుత ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఓయూ వీసీ ప్రొ. కుమార్ ముల్గారం , తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ గౌరీ శంకర్ ,ప్రొ. టి వెంకట రాజయ్య, డాక్టర్ జి ఉపేందర్ ,అడ్లూరు రవీంద్ర చారి లు జ్యోతి ప్రజ్వలన చేసి వీరబ్రహ్మేంద్రస్వామి చిత్ర పటానికి పూలమాలనువేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రొ. ఎన్ గోపి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ వీరబ్రహ్మం ఒక భావావేశ ప్రాతిపదికన ప్రజలను కూడగట్టే ప్రయత్నం చేశారని ఒక రకమైన సాంస్కృతిక జాగృతి ని వారిలో కలిగించారని ఆయన పేర్కొన్నారు. వేమన చేయలేనిది బ్రహ్మం చేసి చూపించారన్నారు. ఆయన ఒక బలమైన నిర్వాహక శక్తిగా ఆయన అభివర్ణించారు. వృత్తికారులను ఏకం చేయడమనే గొప్ప గమ్యానికి ఆయన అవలంబించిన ఎత్తుగడ చరిత్రలోనే ఒక అపూర్వమైనదని ఆయన పేర్కొన్నారు. ఆయన ఒక వ్యక్తి అయినా బ్రహ్మ సంప్రదాయానికి ఒక ప్రతీకగా భావించడం సబబు అని ఆయన అభిప్రాయపడ్డారు. బ్రహ్మం రచనల గురించి ప్రస్తావిస్తూ నిగూఢ మైనటువంటి ఆయన రచనలు అద్వైతాన్ని యోగవిద్యను ప్రతిబింబించేవిగా ఉంటాయని అవి ఆనాటి తరాల నుంచి ఈనాటి తరం వరకు ఆ మర్మాలను అర్థం చేసుకోవడంలో లోపం కనిపి స్తోందన్నారు. సామాన్య ప్రజల్లో కాలజ్ఞానం మూలంగానే ఆయనకు ఎక్కువ కీర్తి లభించిందనితెలిపారు. ఈ సదస్సులో వీరబ్రహ్మేంద్రస్వామి సమాజసంస్కరణకోసం చేశినకృషిని యూనివర్సిటీ వీసీ ప్రొ కుమార్ మొలుగారం, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ టి.గౌరిశంకర్ వీరబ్రహ్మేంద్రస్వామి స్వీయ ఆధ్యాత్మిక దివ్యోద్దీపన స్వచ్ఛందసంస్థ గౌరవసభ్యులు ప్రొ. టి వెంకట రాజయ్య.కన్వీనర్ అడ్లూరి రవీంద్రాచారితదితరులు ప్రసంగించారు.బిసి సెల్ డైరెక్టర్ డా.జి ఉపేందర్ సంధానకర్తగావ్యవహరించారు.ఈ కార్యక్రమంలో ధర్మపీఠం ప్రధాన సంచాలకులు శివశ్రీ, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. జి ప్రభాకర్, డా. హమీదా బీ (డైరెక్టర్, మైనారిటీస్ సెల్), ప్రొఫెసర్ ఐ. డైసీ (డైరెక్టర్, ఎస్సీ/ఎస్టీ సెల్), డా. కొండ నాగేశ్వర్ (సివిల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్), డా. వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ రాములు, డా. యాదగిరి, డా. శ్రీనివాస్, డా. ఆమంచి నాగేశ్వర్ రావు విద్యార్థులు టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ మరియు వీరబ్రహ్మం భక్తులు పాల్గొని విజయవంతం చేశారు.



# ఇందిరమ్మ ఇండ్ల అవకతవకలు

- ఆర్డీవో, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి కి ఫిర్యాదు.

**సైదాపూర్, విశాలభారతి:**

ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అవకతవకలు జరిగాయని హుజురాబాద్ ఆర్డిఓ రమేష్ బాబు కు, వెన్నంపల్లి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి జి భాగ్యలక్ష్మి కి శనివారం వెన్నంపల్లి యువకులు ఫిర్యాదు చేశారు. నివాస గృహాలు లేని అర్హులైన వారికి కాకుండా గృహాలు ఉన్న వ్యవసాయ భూములు ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని పిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అవకతవకలకు కారణమైన పంచాయతీ కార్యదర్శి రామగిరి హరీష్ అని పిర్యాదులో పేర్కొన్నారు. మండల, జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టి గ్రామంలో అర్హులైన వారిని గుర్తించాలని కోరారు. పిర్యాదు చేసిన వారిలో కనకం శ్రీనివాస్, మొలుగూరి తిరుపతి, అయిలయ్య, స్వరూప, సురేష్, రవీందర్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.



# ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బందులు పెట్టొద్దు

- ఇంచార్జ్ జేసీ హరి ప్రియ
- ధాన్యం మైశ్చర్ తప్పనిసరి
- వెంటనే ట్యాంపర్ చేయాలి.

**కీసర, విశాలభారతి:**

కీసరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ఇంచార్జ్ అడిషనల్ కలెక్టర్ హరి ప్రియ సందర్శించి పరిశీలించారు. రైతుల నుండి సుమారు 12402 ధాన్యం బ్యాగులు కొనుగోలు చేయగా ట్యాంపర్ చేసి రైస్ మిల్లుకు 10679 ధాన్యం బ్యాగులు తరలించిన అధికారులు.ఇప్పటి వరకు కీసరలో 71 రైతులు వారి వారి ధాన్యంను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అమ్ముకొగా 33 మంది రైతులకు ప్రభుత్వం నుండి నేరుగా రైతు ఖాతాల్లోకి డబ్బులు జమ అయ్యాయి.ఈ సంధర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుండి ధాన్యం కొనే ముందు ధాన్యం మైశ్చర్ తప్పక చూడాలి అని అధికారులకు సూచించారు. అలాగే ధాన్యం మైశ్చర్ చేశాక ట్యాంపర్ చేసి వెంటనే ధాన్యంను రైస్ మిల్లుకు తరలించాలి అధికారులను ఆదేశించారు.ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులు పెట్టొద్దు అని అన్నారు.వర్షం పడ్డ ధాన్యం తడవకుండా ఉండడానికి గోదాం చాలా పెద్దదిగా ఉంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో డి సి ఓ వెంకట్ రెడ్డి,కీసర ఆర్డీఓ వెంకట్ ఉపేందర్ రెడ్డి,కీసర తహసీల్దార్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- మాజీ సర్పంచ్ మాధురి వెంకటేష్.

**కీసర,విశాలభారతి:**



గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా హరితసేన ఆధ్వర్యంలో శనివారం కీసర గుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హరితసేన మహిళా అధ్యక్షులు మాజీ సర్పంచ్ నాయకపు మాధురి మొక్కలు నాటారు.మాధురి వెంకటేష్ సహకారంతో కీసర గుట్టలో మదర్ థెరిసా ఎన్జీఓ సంస్థతో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది.శనివారం ముగింపు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో మహిళలతో కలిసి మొక్కలు నాటారు.ఈ సంధర్భంగా మాదురి వెంకటేష్ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగడానికి కుట్టు మిషన్ శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి సర్టిఫికెట్స్ అందజేయడం చాలా సంతోషంగా ఉంది అన్నారు.కుటుంబంలో తమ వంతుగా తాము కుటుంబానికి చేదోడుగా ఉండడానికి కుట్టు మిషన్ శిక్షణ నేర్చుకోవడం శుభపరిణామం అన్నారు.కుట్టు మిషన్ శిక్షణ నేర్చుకొని జీవితంలో ముందుకు సాగబోతున్న మహిళలకు అందరికి అభినందనలు తెలిపారు. మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ గ్రీన్ ఛాలెంజ్ హరితసేనలో భాగంలో మొక్కలు నాటడం చాలా సంతోషంగా ఉంది అన్నారు.ప్రతీ ఒక్కరు తమ తమ ఇండ్లలో మొక్కలు నాటాలి అని మహిళలను కోరారు .ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## cinema updates



# ఆ రెండు సినిమాలకు పవన్ పారితోషికం వద్దన్నాడా?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఒక్కో సినిమాకు భారీగా పారితోషికం అందుకుంటారు. టాలీవుడ్ లో అత్యధిక పారితోషికం అందుకుంటున్న నటుడిగా ఆయనకు పేరుంది. అదే పవన్ లో అంతే సానుభూతి కూడా ఉంటుందన్నది అందిరికీ తెలిసిందే. ఆయన నటించిన హిట్ అయితే పర్వాలేదు. అదే సినిమా ఫ్లాప్ అయితే నిర్మాతను దృష్టిలో పెట్టుకుని పారితోషికంలో మినహాయింపులుఇస్తుంటారు. ఒక్కోసారి రూపాయి కూడా తీసుకోకుండా తీసుకున్న అడ్వాన్స్ నే తిరిగి ఇచ్చేస్తుంటారు. ఇలా అడ్వాన్స్ కూడా తిరిగి ఇచ్చేయడం అన్నది ఆయనకు మాత్రమే చెల్లింది. అందుకే పవన్ నటుడిగా కంటే గొప్ప వ్యక్తిత్వం.. దాతృహృదయం కలిగిన మనిషిగా అభిమానుల్లోకి బలంగా వెళ్లిపోయాడు. తాజాగా పవన్ మరోసారి తన దాతృహృదయాన్ని చాటుకున్నట్లు కనిపిస్తుంది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ హీరోగా మూడు సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. `హరిహరవీరమల్లు`, `ఓజీ` , `ఉస్తాద్ భగత్ సింగ్` సినిమాలు చేస్తున్నారు. ఇటీవలే వీరమల్లు షూటింగ్ కూడా పూర్తిచేసారు. జూన్ లో సినిమా రిలీజ్ అవుతుంది. ఈ సినిమా సెట్స్ లో ఉండగానే ఉస్తాద్ భగత్ సింగ్ కూడా మొదలు పెట్టారు. ఈ రెండు సినిమాలకు కలిపి పవన్ 30 కోట్లకు పైగా అడ్వా న్సులు తీసు కున్నారు. వీరమల్లు కోసం 20 కోట్లు తీసుకోగా, ఉస్తాద్ భగత్ సింగ్ కోసం 15 కోట్లు తీసుకున్నారుట. ఇటీవలే ఆ చిత్ర నిర్మాతలను పవన్ అమరావతికి పిలిపించి మాట్లాడారుట. రెండు సినిమా రిలీజ్ లు బాగా ఆలస్యమవ్వడంతో బ్యాలెన్స్ అమౌంట్ ఇవ్వొద్దని జాలి చూపించారుట. తన వల్ల తమ సినిమాలకే కొంత నష్టం వచ్చిందని....వాటన్నింటిని మర్చిపోయి సినిమా రిలీజ్ లు సవ్యంగా అయ్యేలా చూడమని...అదే తనకు ఇచ్చే బ్యాలెన్స్ పారితోషికం అని మాట్లాడారుట. మొత్తానికి మరోసారి పవన్ తన దాతృ హృదయాన్ని చాటుకున్నట్లు తెలుస్తుంది.



# ఒక్క హిట్ తో అంత పెంచేసిందా?

ఇండస్ట్రీలో అన్నీ అనుకున్నంత ఈజీగా రావు. చూడ్డానికి, చెప్పడానికే రంగుల ప్రపంచం కానీ సినీ ఇండస్ట్రీలో ఉన్నన్ని ఇబ్బందులు, సమస్యలూ ఎందులోనూ ఉండవనిపిస్తుంది అందులో ఉండేవారికి. చిత్ర పరిశ్రమలో ఎవరెప్పుడు సక్సెస్ అవుతారో ఎవరూ చెప్పలేం. కొంతమందికి ఎన్నో ఏళ్లుగా దొరకని స్టార్‌డమ్ ఒక్క సినిమాతో వచ్చేస్తుంది. ఇప్పుడు హీరోయిన్ కయ్యదు లోహర్ ది కూడా ఇదే సిట్యుయేషన్. ముకిల్ పేట్ అనే కన్నడ సినిమాతో 2021లో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన కయ్యదు, ఆ సినిమాతో మంచి రిజల్ట్ ఏమీ అందుకోలేదు. ఆ తర్వాత మలయాళంలోకి వెళ్లి అక్కడ పత్తొండదామ్ నూట్రాండు అనే మూవీతో తన లక్ ను టెస్ట్ చేసుకుంది కానీ అది కూడా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. అలా తెలుగులో అల్లూరి, మరాఠి భాషలో ఓ సినిమా చేసింది కానీ అవేమీ అమ్మడికి క్రేజ్ ను తెచ్చిపెట్టలేదు. అలా అని అమ్మడికి ఆఫర్లు రావట్లేదా అంటే వస్తున్నాయి. సినిమాలు ఆడకపోయినా తన లక్ తో అవకాశాలను అందుకున్న కయ్యదు రీసెంట్ గా తమిళంలో చేసిన డ్రాగన్ సినిమా మంచి హిట్ ను అందించింది.డ్రాగన్ తర్వాత అమ్మడి లక్ కు సక్సెస్ కూడా తోడవడంతో దర్శకనిర్మాతలు ఇప్పుడు కయ్యదు వెనుక పడుతున్నారు. ఇప్పటికే పలు సినిమాలకు సైన్ చేసిన అమ్మడు తన డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని పారితోషికాన్ని పెంచిందని తెలుస్తోంది. డ్రాగన్ సినిమాకు రూ.30 లక్షలు మాత్రమే తీసుకున్న కయ్యదు ఆ సినిమా హిట్ తర్వాత మరో రూ.70 లక్షలు అందుకుందని సమాచారం.ఇప్పుడు తన రాబోయే సినిమాలకు కయ్యదు తన రెమ్యూనరేషన్ ను రూ. 2 కోట్లకు పెంచిందని తెలుస్తోంది. దానికి కారణం శింబు, ధనుష్ లాంటి స్టార్ హీరోల సరసన అమ్మడు నటిస్తుండటమే. ప్రస్తుతం అధర్వతో ఇదయం మురళితో పాటూ, జీవీ ప్రకాష్ కుమార్‌తో ఇమ్మార్టల్ సినిమా చేస్తున్న కయ్యదు, మరోవైపు శింబుతో సినిమాకు రెడీ అవుతోంది. ఇవి కాకుండా ధనుష్- విఘ్నేష్ రాజా కాంబోలో వచ్చే సినిమాతో పాటూ తమిళరసన్-ధనుష్ కలయిక లో తెరకెక్కే సినిమాలో కూడా కయ్యదును తీసుకోవాలని అనుకుంటున్నారట. అన్నీ కుదిరి ధనుష్ తో కూడా నటిస్తే కయ్యదు తన రెమ్యూనరేషన్ ను మరింత పెంచినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మొత్తానికి డ్రాగన్ సినిమా అమ్మడి జీవితాన్ని ఒక్కసారిగా మార్చేసింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.